క్లుప్తంగా

కొండెవరంలో సహాయక చర్యలు



కొండెవరంలో బాధితులకు భోజనాలు వడ్డిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కొత్తపల్లి: మిచాంగ్ తుపాన్ ప్రభావంతో మండలంలోని కొండెవరం శివారు ఇందిరా కాలనీలో మంగళవారం సుడిగాలి బీభత్సం సృష్టించింది. సుమారు 50 పెంకుటిళ్ల పైకప్పులు దెబ్బతిన్నాయి. వైఎస్సార్ సీపీ నాయకులు బుధవారం బాధిత కుటుంబాలను పరామర్శించి సహాయక చర్యలు అందించారు. ఎమ్మెల్యే పెండెం దొరబాబు ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు బాధితులకు భోజన సౌకర్యం కల్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్, కొత్తపల్లి పీఏసీఎస్ అధ్యక్షుడు మారిశెట్టి సత్తిబాబు, పార్టీ నాయకులు గాది గంగబాబు, మేడిశెట్టి శ్రీరాములు, వాకతిప్ప సర్పంచ్ పాలాని దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

పంచారామ క్షేత్రంలో జ్యోతిర్లింగార్చన



పంచారామ క్షేత్రంలో చేసిన జ్యోతిర్లింగార్చన

సామర్లకోట: కార్తిక మాసం సందర్భంగా స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వర స్వామి ఆలయంలో బుధవారం రాత్రి జ్యోతిర్లింగార్చన ఏర్పాటు చేశారు. ఆలయ ధ్వజస్తంభం వద్ద ఆకాశదీపానికి ఆలయ పండితులు పూజలు నిర్వహించి వెలిగించారు. జ్యోతిర్లింగార్చనలో దీపాలను లక్షపత్రి పూజలు చేసుకున్న భక్తులు వెలిగించారు. పూజల్లో దవులూరి చారిటబుల్ ట్రస్టు అధినేత దవులూరి సుబ్బారావు, ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులు యండమూరి వెంకటసుబ్బారావు, నాతిపాముల సూరిబాబు, మాజీ కౌన్సిలర్ దూది రాజు తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా పారదర్శకంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ

సామర్లకోట: ఓటర్ల జాబితా విమర్శలకు తావులేకుండా, పారదర్శకంగా ఉండాలని పెద్దాపురం ఆర్డీఓ జె.సీతారామారావు అన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక నీలమ్మ చెరువు వద్ద ఉన్న లయన్స్ క్లబ్ భవనంలో బీఎల్ఓల సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఆయా బూత్‌ల పరిధిలోని ఓటర్ల వివరాలను బీఎల్ఓలు సక్రమంగా సేకరించాలన్నారు. డోర్ నంబర్ల ఆధారంగా ఇంట్లో ఓటర్లు వివరాలు తెలుసుకోవాలని సూచించారు. ఓటర్ల గుర్తింపు కార్డులు, ఆధార్ కార్డులను పరిశీలించాలని చెప్పారు. ఒకే ఇంట్లో పది కంటే ఎక్కువ ఓట్లు ఉంటే, వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ ఎస్ఎల్‌వీ కుమారి, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పంట రవాణాకు మార్గమేదీ?



పంచారామ క్షేత్రం వెనుక వంతెన పనుల కోసం పొలాల మీదుగా తవ్విన గోతులు

సామర్లకోట: రైతుల పంటను రవాణా చేసే మార్గం లేకుండా, వంతెన పనుల పేరుతో గోతులు తవ్వారని రైతు సంఘ నాయకుడు నేతల హరిబాబు ఆవేదన వ్యక్తం చేశారు. 216 జాతీయ రహదారి పనుల్లో భాగంగా పంచారామ క్షేత్రం వెనుక భాగంలోని పొలాల మీదుగా రోడ్డు నిర్మాణ పనులు చేస్తున్నారు. ఇందులో భాగంగా గోదావరి కాలువపై వంతెన నిర్మాణానికి పంచారామ క్షేత్రం వెనకున్న పొలాల్లో పనులు చేపట్టారు. గోతులు తవ్వడంతో ధాన్యం రవాణాకు అవకాశల లేకుండా పోయింది. దీనిపై తహసీల్దార్ ఎస్ఎల్‌వీ కుమారి, మండల వ్యవసాయాధికారి ఐ.సత్యను వివరణ కోరగా, ఆ ప్రదేశాలను పరిశీలించామని తెలిపారు. వంతెన పనులు చేస్తున్న కాంట్రాక్టరుతో మాట్లాడి, రైతుల సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. సుమారు 500 ఎకరాల్లో పంట ఉంటుందన్నారు.



గొల్లప్రోలు మండలంలో నీట మునిగిన మునగ తోట



చేబ్రోలులో కోటలంక వారి చెరువుకు పడిన గండిని పూడ్పిస్తున్న జెడ్పీటీసీ నాగ లోవరాజు



ఆర్‌బీ పట్నంలో నేలకొరిగిన దుంప పంటను పరిశీలిస్తున్న సిబ్బంది



రమణక్కపేటలో తడిసి ముద్దయిన వరిపనలు

ముంచెత్తిన వరద



కట్టమూరులో నీట మునిగిన వరి పంటను పరిశీలిస్తున్న అధికారులు

- రైతులను నిండా ముంచిన తుపాను
- వాణిజ్య పంటలకు అపార నష్టం
- పిఠాపురం, గొల్లప్రోలు మండలాల్లో పలుచోట్ల కాలువలకు గండ్లు
- అన్నదాతలకు అండగా నిలుస్తున్న అధికారులు

పిఠాపురం: మిచాంగ్ తుపాను ప్రభావంతో మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు రైతులను నిలువునా ముంచేశాయి. ఎడతెరిపి లేని వర్షాల కారణంగా వచ్చిన వరద నీరు వరి, వాణిజ్య పంటలను ముంచెత్తింది. చేలన్నీ చెరువులుగా మారిపోయాయి. ఎక్కడ చూసినా నీరు తప్ప పొలం కనిపించని పరిస్థితి నెలకొంది. గొల్లప్రోలు మండలంలో పత్తి, పూలతోటలు, బెండ, వంగ, టమాటా దొండ, మిరప తదితర వాణిజ్య పంటలు పూర్తిగా నీట మునిగాయి. ఇప్పటికే కోత కోసి కళ్లాల్లో ఉన్న ధాన్యం రాశులు, వరి పనలు తడిసి ముద్దయ్యాయి. 216వ నంబర్ జాతీయ రహదారిపై చేబ్రోలు వద్ద వరద నీరు ఉధృతంగా ప్రవహించడంతో వాహనాల రాకపోకలు కొన్ని గంటల పాటు నిలిచిపోయాయి. పోలీసులు తగిన చర్యలు తీసుకుని వన్‌వేలో వాహనాలను మళ్లించారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలులో కోటలంక వారి చెరువుకు గండి పడింది. జెడ్పీటీసీ వులవకాయల నాగ లోవరాజు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేయించడంతో పెను ప్రమాదం తప్పింది. పిఠాపురం మండలంలోనూ వందల ఎకరాల్లో వరి, వాణిజ్య పంటలు వర్షానికి దెబ్బతిన్నాయి. అధిక వర్షాలకు దెబ్బ తిన్న పొలాలను అధికారులు పరిశీలించి నష్టాలను అంచనా చేస్తున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు పలు గ్రామాల్లో పర్యటించి రైతులకు పలు సూచనలు, సలహాలు ఇస్తున్నారు.

స్తంభించిన జన జీవనం

కొత్తపల్లి: మిచాంగ్ తుపాను ప్రభావంతో గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలకు మండలంలో జనజీవనం స్తంభించింది. ప్రధాన రహదారుల్లో పలు చోట్ల వర్షపునీరు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో సుమారు 690 ఎకరాల్లో వరిపంట నీట మునిగినట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. పలు గ్రామాల్లో పనలపై ఉన్న వరి పంట నీట మునిగింది. టార్పాలిన్లతో కప్పిన ధాన్యం రాశుల్లోకి నీరు చేరింది. ఇటుకల బట్టీలు, బ్రిక్స్ పరిశ్రమల్లో కూడా నీరు చేరడంతో ఇటుకలు ఎందుకూ పనికి రాకుండా పోయాయని యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రైతులను ముంచిన తుపాను

సామర్లకోట: చేతికందే పంట నీట మునగడంతో రైతులు అల్లాడిపోతున్నారు. మండలంలో 22,500 ఎకరాల్లో వరి సాగు చేశారు. ఇప్పటికే అనేక గ్రామాల్లో వరి కోతలు పూర్తవ్వగా, ధాన్యం విక్రయించారు. మండలంలోని పవర, పండ్రవాడ, గొంచాల, అచ్చంపేట, నవర, ఉండూరు, వీకే రాయపురం గ్రామాల్లో 980 ఎకరాల్లో వరి పంట నేలకొరిగిందని, 280 ఎకరాల్లో పంట నీట మునిగిందని, 30 ఎకరాల్లో వరి పనలు నీటిలో మునిగాయని ఎంఏఓ ఐ.సత్య తెలిపారు. విక్రయానికి సిద్ధంగా ఉంచిన మూడు వేల మెట్రిక్ టన్నుల ధాన్యం తడిచిపోయిందని చెప్పారు. ప్రభుత్వం తడిచిన ధాన్యాన్ని ఆర్బీకేల ద్వారా కొనుగోలు చేయనున్నట్టు పేర్కొన్నారు. తేమ 17 నుంచి 20 శాతం వరకు అనుమతిస్తున్నట్టు తెలిపారు.

కాజ్‌వేపై స్తంభించిన రాకపోకలు

కాగ వీకే రాయపురం వరి పంటను బయటకు తీసుకురాలేని పరిస్థితి ఏర్పడిందని రైతు సంఘ నాయకులు తలారి దొరబాబు, వెలమర్తి బుల్లిరాజు, ఇంటి వెంకట్రావు, గొలపల్లి శ్రీనివాసరావు, వెలమర్తి శ్రీనివాసులు తెలిపారు. ఏలేరు కాలువ ఆవలి వైపు రైతుల పంట భూములున్నాయి. పొలాలకు చేరడానికి కాజ్‌వే మీదుగా రాకపోకలు సాగించాలి. ఇటీవల కాజ్‌వే శిథిలమైంది. జిల్లా కలెక్టరు ఇచ్చిన నిధులతో ఏలేరు కాలువలో ఉన్న కాజ్‌వేకు తాత్కాలిక మరమ్మతులు చేయగా, వర్షాల కారణంగా కాజ్‌వే బురదమయంగా మారిందని రైతులు తెలిపారు. దాంతో వాహనాల రాకపోకలకు అవకాశం లేకుండాపోయిందని ఏఓ సత్య తెలిపారు. ఇప్పటికే రైతులు కోతలు పూర్తి చేసిన ధాన్యం పొలాల్లో ఉన్నాయన్నారు. ఆ ధాన్యాన్ని పరిశీలించామని చెప్పారు.



రమణక్కపేటలో తడిసిన పనలపై ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేస్తున్న రైతులు

కూలిన ఇళ్లు

తుపాను కారణంగా మండలంలో ఆరు ఇళ్లు కూలిపోయినట్టు సమాచారం అందిందని తహసీల్దార్ ఎస్ఎల్‌వీ కుమారి తెలిపారు. పెద్దాపురం డివిజన్ పరిధిలో 70 వరకు విద్యుత్ స్తంభాలకు నష్టం జరిగిందని, 25 ట్రాన్స్‌ఫార్మర్లు పాడైపోయాయని డీఈ ఎ.ప్రభాకర్ తెలిపారు. రెండు కి.మీ. మేర లైన్లు దెబ్బతిన్నాయని చెప్పారు. ట్రాన్స్‌కోకు సుమారు రూ.20 లక్షల నష్టం జరిగి ఉంటుందని తెలిపారు.

600 ఎకరాల్లో పంట నష్టం

పెద్దాపురం: మిచాంగ్ తుపాను రైతులను నట్టేట ముంచింది. మూడు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు రైతులు తీవ్రంగా నష్టపోయినట్టు వ్యవసాయ, ఉద్యాన శాఖాధికారులు పేర్కొన్నారు. పెద్దాపురం మండలంలో బుధవారం ఏఓ కె.సంజయ్‌కుమార్, ఉద్యాన శాఖాధికారి సుజాత పంటలను పరిశీలించారు. రైతుల నష్టంపై అంచనాలను రూపొందించేందుకు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా పెద్దాపురం మండలంలో సుమారు 450 ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లినట్టు ఏఓ సంజయ్ తెలిపారు. అలాగే మెట్ట ప్రాంతంలో 40 హెక్టార్లలో దుంప, 16 హెక్టార్లలో అరటి, రెండు హెక్టార్లలో కూరగాయల పంటలు, రెండు హెక్టార్లలో బొప్పాయి పంటకు నష్టం వాటిల్లిందని ఉద్యాన శాఖాధికారి సుజాత తెలిపారు. వ్యవసాయ, ఉద్యాన పంటలు వెరసీ సుమారు 600 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్టు అధికారులు తెలిపారు.



వీకే రాయపురంలో తడిచిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఏఓ సత్య



గొల్లప్రోలు మండలం చెందుర్తిలో నీట మునిగిన పత్తి చేలు



తాటిపర్తి-గొల్లప్రోలు రోడ్డుపై ఉధృతంగా ప్రవహిస్తున్న నీరు



కొండెవరం శివారు కాశీవారిపాకలలో నీట మునిగిన ఇటుకల బట్టీ



గొల్లప్రోలు మండలంలో నీట మునిగిన వరి పంటను చూపిస్తున్న రైతు

ప్రతి గింజా కొనుగోలు చేస్తాం

- రైతులు అధైర్యపడొద్దు
- జిల్లా వ్యవసాయ శాఖాధికారి విజయకుమార్



గొల్లప్రోలు మండలంలో రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి విజయకుమార్

పిఠాపురం: వర్షాలకు పంట దెబ్బతిన్న రైతులు అధైర్యపడాల్సిన పని లేదని, ధాన్యం ఎలా ఉన్నా ప్రతి గింజా కొనుగోలు చేస్తామని జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఎన్.విజయకుమార్ అన్నారు. గొల్లప్రోలు మండలంలోని పలు గ్రామాల్లో నీట మునిగిన వరి పంటలను బుదవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకినాడ జిల్లాలో ఈ ఖరీఫ్ సీజన్‌లో 2.03 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా ఇప్పటి వరకు 1.30 లక్షల ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయన్నారు. సుమారు 80 వేల ఎకరాల్లో ఇంకా కోతలు కోయాల్సి ఉండగా వర్షాల వల్ల ప్రస్తుతం ఆ పంటలు నీట మునిగినట్లు తెలిపారు. గొల్లప్రోలు మండలంలో మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు 299 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావడంతో పలు గ్రామాల్లో పంటలు నీట మునిగాయన్నారు. వ్యవసాయ, నీటిపారుదల, రెవెన్యూ, రైతు భరోసా కేంద్రాల సిబ్బంది, ఉద్యాన తదితర శాఖల అధికారులు గ్రామాల్లో పర్యటించి రైతులకు పలు సూచనలు, సలహాలు ఇస్తున్నారన్నారు. పొలాల్లో ఉన్న నీటిని త్వరితగతిన బయటకు పంపించేయడం ద్వారా నష్టాలను నివారించవచ్చన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు తడిసిన, మొలకలు వచ్చిన, రంగు మారినా ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా వర్షాలకు తడిసిన, నీట మునిగిన పంటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వ్యవసాయ శాఖ సిబ్బంది ద్వారా రైతులకు వివరిస్తున్నామన్నారు. ప్రస్తుతం అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి నష్టాలను అంచనా వేస్తున్నారన్నారు. జిల్లాలో 270 ఎకరాల్లో పత్తి, 230 ఎకరాల్లో మినుము, పెసర పంటలు దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా అంచనా వేశామన్నారు. ఆయా పంటలకు సైతం నష్ట పరిహారం ఇప్పించడానికి చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. ఆయన వెంట పిఠాపురం ఏడీఏ పి.స్వాతి, గొల్లప్రోలు వ్యవసాయశాఖ అధికారి సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

రైతులు పేర్లు నమోదు చేసుకోవాలి

పెద్దాపురం: విపత్తుల కారణంగా రైతులు పంట దిగుబడిపై అధైర్య పడాల్సిన పని లేదని, ప్రతి రైతు తమ ధాన్యాన్ని విక్రయించేందుకు ఆర్‌బీకేల్లో పేర్లను నమోదు చేసుకోవాలని పెద్దాపురం జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, తహసీల్దార్ వి.జితేంద్ర అన్నారు. బుధ వారం సాయంత్రం ఏఓ సంజయ్‌కుమార్, వ్యవసాయ సలహా మండలి సభ్యులు ఏలేటి అనంతలక్ష్మి, నల్లల గోవిందు, పెంటా విజయ్‌కుమార్‌తో కలిసి కట్టమూరులోని కళ్లాల్లో ధాన్యం నిల్వలు, వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ, తహసీల్దార్ మాట్లాడుతూ తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. రైతులు దళారులను ఆశ్రయించవద్దని కోరారు. ఎక్కడ రంగుమారిన ధాన్యం ఉన్నా.. రైతుల నుంచి నేరుగా కొనుగోలు చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారన్నారు. తేమ శాతాన్ని బట్టి ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేస్తుందన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



కట్టమూరులో రైతులకు సూచనలిస్తున్న జెడ్పీటీసీ, తహసీల్దార్

తేరుకున్న తీరం

- ఊపిరిపీల్చుకున్న మత్స్యకారులు
- బీచ్‌రోడ్డులో వాహనాల రాకపోకలు ప్రారంభం



ప్రశాంతంగా ఉన్న సముద్రం

కొత్తపల్లి: మిచాంగ్ తుపాన్ ప్రభావంతో తీరప్రాంత గ్రామాలు గత నాలుగు రోజులుగా చిగురుటాకులా వణికిపోయాయి. తీరంలో అలలు ఉవ్వెత్తుల ఎగసిపడడంతో మత్స్యకారులు ఆందోళనకు గురయ్యారు. తీరప్రాంతంలో మత్స్యకార గృహాలు కోతకు గురయ్యాయి. తుపాన్ తీరం దాటే సమయంలో ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. బుధవారం తీరంలో అలల ఉధృతి తగ్గడంతో మత్స్యకారులు ఊపిరి పీల్చుకున్నారు. అధికారులు పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేసి మత్స్యకారలకు వసతులు కల్పించారు. సుమారు 400 మందికి భోజన వసతులు కల్పించినట్లు తహసీల్దార్ ప్రసాద్ తెలిపారు. తుపాన్ ప్రభావంతో ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉప్పాడ-కాకినాడ బీచ్‌రోడ్డలో నిలిపివేసిన రాకపోకలను యథావిధిగా కొనసాగించారు. భారీవాహనాలను మినహాయించి మిగిలిన వాహనాలను అనుమతించారు.

సంపద తయారీ కేంద్రం తనిఖీ



చదలాడ సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న రాజశేఖర్

పెద్దాపురం: ప్రతి గ్రామంలో సంపద తయారీ కేంద్రాలను సమర్థంగా నిర్వహించాలని పెద్దాపురం మండల విస్తరణాధికారి కె.రాజశేఖర్ అన్నారు. చదలాడ సంపద తయారీ కేంద్రాన్ని బుధవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. కేంద్రాల నిర్వహణలో పంచాయతీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. కేంద్రాల వద్ద అసాంఘిక కార్యకలాపాలు సాగిస్తున్నట్టు తెలిస్తే, వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కేంద్ర నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యదర్శి ఈశ్వరరావును అభినందించారు.

అంబేడ్కర్ స్ఫూర్తి మానవాళికి ఆదర్శం



సామర్లకోట మున్సిపల్ కార్యాలయంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసిన చైర్‌పర్సన్ తదితరులు

పెద్దాపురం: రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ ఆశయ స్ఫూర్తి సర్వ మానవాళికి ఆదర్శమని మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్ అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా బుధవారం స్థానిక మున్సిపల్ సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి కౌన్సిలర్లు విడదాసరి రాజా. ఆరెళ్లి వీర్రాఘవులు, గుర్రాల యాకోబు, జాలా దావీదు, పెద్దింటి లక్ష్మణ్‌తో కలిసి సాయిప్రసాద్ ఘనంగా నివాళులర్పించారు. స్థానిక మున్సిపల్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి సీపీఎం నాయకులు నీలపాల సూరిబాబు ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు.

కొత్తపల్లి: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అందరికీ ఆదర్శనీయుడని పలువురు వక్తలు అన్నారు. అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ పొన్నాల, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. వాకతిప్ప సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి స్థానిక నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు ఇజ్జిన కామేశ్వరావు, కందెల్లి పెద్దబ్బాయి, సీకోలు సత్యనారాయణ, బత్తిన శ్రీనివాసరావు, బొంగుర్ల సింహాచలం తదితరులు పాల్గొన్నారు. జొన్నలగరువులో అంబేడ్కర్ విగ్రహానికి ఏపీ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు గుబ్బల రాజు, జిల్లా అధ్యక్షుడు దారా వెంకటరావు ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

సామర్లకోట: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి అంబేడ్కర్ విశేష కృషి చేశారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఉబా జాన్‌మోజెస్, మున్సిపల్ కమిషనర్ జె రామారావు, మేనేజరు అచ్యుతరాజు, కౌన్సిలర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలోని అంబేడ్కర్ విగ్రహానికి ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, ఎంపీడీఓ డి.శ్రీలలిత నివాళులర్పించారు. ఉపాధి హామీ ఏపీఓ ప్రభాకర్, ఎంఈఓ వై శివరామకృష్ణయ్య పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్ ఆవరణలో..

స్థానిక రైల్వే స్టేషన్ ఆవరణలో స్టేషన్ మేనేజరు ఎం.రమేష్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ వర్ధంతి జరిగింది. ప్లాట్‌ఫాం నం.1పై అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. రైల్వే ఉద్యోగులు, కార్మికులు, పోర్టర్లు పాల్గొన్నారు. బ్రౌన్‌పేట, బలుసులపేట, కొత్తకోట, కుమ్మరవీధి, పెన్షన్‌లైన్, రైల్వే స్టేషన్ ఆవరణలో ఉన్న అంబేడ్కర్ విగ్రహాలకు నివాళులర్పించారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

- ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు

సామర్లకోట: సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందజేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు అన్నారు. వీకే రాయపురంలో బుధవారం సాయంత్రం వైఎస్సార్ సీపీ నాయకులు తలారి దొరబాబు, ఇంటి వెంకట్రావు, రాంబాబు, వెలమర్తి శ్రీనివాసు ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. ఎంపీపీ మాట్లాడుతూ సంక్షేమాభివృద్ధి పథకాలతో ప్రజలకు ఎంతో మేలు జరిగిందని తెలిపారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందని వారిని గుర్తించడానికి ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. పెద్దాపురం నియోజకవర్గం నుంచి వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి స్థానికుడైన దవులూరి దొరబాబుకు అవకాశమిచ్చారని, ఆయనను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ డి.శ్రీలలిత, ఈఓపీఆర్డీ కర్రి హరికృష్ణ సత్యారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు తాటికొండ అచ్చిరాజు, సర్పంచ్ మోర్త పూర్ణిమ, సచివాలయాల మండల కన్వీనర్ ఉటా వాసు, అచ్చంపేట సొసైటీ అధ్యక్షుడు వీరంరెడ్డి నాని, పంచాయతీ కార్యదర్శి వై శ్రీహరి, పార్టీ నాయకులు మలిరెడ్డి వెంకట్రావు, చల్లా శ్రీనివాసు, కోట యోగి తదితరులు పాల్గొన్నారు.



వీకే రాయపురంలో పథకాల బోర్డును ఆవిష్కరించిన ఎంపీపీ, ఎంపీడీఓ, సర్పంచ్ తదితరులు

సొంతింటి కల వైఎస్సార్ సీపీతోనే సాధ్యం

పెద్దాపురం: సొంతిటి కల వైఎస్సార్ సీపీ ప్రభుత్వంతోనే సాకారమవుతుందని మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్ అన్నారు. పట్టణంలో టిడ్కో గృహాల లబ్ధిదారులకు బుధవారం ఇళ్ల పట్టాలను ఆయన పంపిణీ చేశారు. మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర అధ్యక్షతన జరిగిన సమావేశంలో సాయిప్రసాద్ మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఇళ్ల నిర్మాణాలు మంజూరు చేస్తారన్నారు. టిడ్కో గృహాల వద్ద అన్ని వసతులు కల్పించి, ఇళ్ల నిర్మాణాలను మరింత వేగవంతం చేస్తారని చెప్పారు. టిడ్కో లబ్ధిదారులకు పట్టాలు, సచివాలయ సిబ్బందికి ఆడుదాం ఆంధ్రా క్రీడాసామగ్రిని సాయిప్రసాద్ అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు విడదాసరి రాజా, త్సలికి సత్యభాస్కర్, ఆరెళ్లి వీర్రాఘవులు, కో-ఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ, షేక్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేస్తున్న సాయిప్రసాద్

